
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 10 । జూలై । 2023



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 2,655, సెంట్రల్ 1,905, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను ఆదివారం విడుదల చేశారు.



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన నూకల మహేశ్వరరావు ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
39.5°/24.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	39.5	24.5
కాకినాడ	36.2	26.6
అమలాపురం	35.5	25.0

న్యూస్‌రీల్

పవర్ లిఫ్టర్లకు అభినందనలు



పవర్ లిఫ్టర్లు, కోచ్‌లను అభినందిస్తున్న అసోసియేషన్ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: వివిధ పోటీల్లో విశేష ప్రతిభ చూపుతున్న అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన పవర్ లిఫ్టర్లను పలువురు అభినందించారు. స్థానిక జిమ్‌లో ఆదివారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. ఇటీవల మలికిపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ టీమ్ చాంపియన్ షిప్ సాధించడంతో పాటు స్ట్రాంగ్ మన్‌గా ఎం.వీరేంద్ర, స్ట్రాంగ్ వుమన్‌గా పి.వందన నిలిచారు. నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోనసీమ జిల్లా టీమ్ చాంపియన్ షిప్, మెన్ విభాగంలో తృతీయ స్థానం, విమెన్ విభాగంలో తృతీయ స్థానం సాధించి చాంపియన్ షిప్‌ను గెలుచుకున్నారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకూ శ్రీకాకుళం జిల్లా రాజాంలో జరగనున్న మాస్టర్స్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీమ్ నుంచి ఈ జిమ్‌కు చెందిన చీకురుమిల్లి కిరణ్ కుమార్, బి.అప్పన్న, ఆకుల శివప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ టీమ్‌కు కోచ్‌గా మట్టపర్తి వెంకట సముద్రం వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన పోటీల్లో విజేతలైన లిఫ్టర్లను, రాజాంలో జరిగే పోటీల్లో తలపడనున్న లిఫ్టర్లను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కిక్కిరిసిన అయినవిల్లి



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలు, ప్రత్యేక అభిషేకాల్లో 61 మంది, లక్ష్మీగణపతి హోమంలో 33 మంది దంపతులు పాల్గొన్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనంలో 487 మంది దర్శించుకున్నారు. 19 మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, తులాభారం నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,45,262 లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



న్యాయమూర్తి రవినాథ్ తిల్హరీకి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న వాడపల్లి ఈఓ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం స్వామి వారి చిత్రపటం, ప్రసాదాన్ని ఈఓ సత్యనారాయణరాజు అందజేశారు. అలాగే ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయంలో జస్టిస్ రవినాథ్ పూజలు చేశారు. ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య, అర్చకులు స్వాగతం పలికారు.

కోటసత్తెమ్మ తల్లికి రూ.2,31,677 ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆషాఢ మాసం, ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.2,31,677 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు



అమలాపురం మండలం పాలగుమ్మి సచివాలయం

- 67 గ్రామాల్లో ఆరంభం
- వైఎస్సార్ జగనన్న భూ సర్వేతో సులభమైన ప్రక్రియ
- సబ్ రిజిస్ట్రార్ల ఆధ్వర్యాన సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

సాక్షి, అమలాపురం: గంటల పాటు రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద వేచి ఉండనవసరం లేదు.. దళారులపై ఆధారపడే పని లేదు.. భూమి రిజిస్ట్రేషన్ల కోసం మండల కేంద్రాలకు, మండలాలు దాటి వెళ్లాల్సిన అవసరం లేదు.. గ్రామంలో కళ్ల ముందుండే సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలైంది. దీనిని గతంలో పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో రెండుచోట్ల ప్రారంభించారు. ఇప్పుడు జగనన్న భూ సర్వే, రీ సర్వే విజయవంతంగా పూర్తయిన ఏడు మండలాల్లోని 67 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

విజయవంతంగా..

తూర్పు డెల్టా పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలతో పాటు ఆలమూరు మండలంలోని పలు గ్రామాల్లో ఈ సేవలను ఆరంభించారు. ఆలమూరు, కె.గంగవరం, రామచంద్రపురం రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట మండలాల్లోని ఎక్కువ గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. అలాగే మధ్య డెల్టా పరిధిలోకి వచ్చేసరికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన అమలాపురం మండలం పాలగుమ్మి, అంబాజీపేట మండలం పసుపల్లి, ముక్కామల గ్రామ సచివాలయాల్లో మాత్రమే రిజిస్ట్రేషన్లకు అనుమతి వచ్చింది. ఇప్పటికే పలు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు విజయవంతంగా జరుగుతూండగా, అక్కడక్కడ సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం అధిగమిస్తోంది.

మండలాల వారీగా రిజిస్ట్రేషన్లకు ఎంపికైన గ్రామాలు

- **కె.గంగవరం:** యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, కుందూరు, ఎర్ర పోతవరం, విలస, గంగవరం, అద్దంపల్లి, కుడుపూరు, కె.గంగవరం, తామరపల్లి, సత్యవాడ, కూళ్ల, సుందరపల్లి, ఉడుమూడి, శివల, గుడిగళ్ల, గుడిగళ్ల బాగా, బాలాంత్రం.
- **అంబాజీపేట:** ముక్కామల, పసుపల్లి.
- **ఆలమూరు:** బడుగువానిలంక, మడికి, చొప్పెల్ల, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు, నవాబ్‌పేట, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, పెదపళ్ల, పినపళ్ల, చింతలూరు.
- **కపిలేశ్వరపురం:** నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, కాలేరు, నల్లూరు, వెదురుమూడి, పడమటి ఇంద్రిగ/ పడమటిపాలెం, వాకతిప్ప.
- **రామచంద్రపురం:** ఏరుపల్లి, తోటపేట, ఉండూరు, కాపవరం, కందులపాలెం, హసన్‌బాద.
- **రాయవరం:** లొల్ల, వెదురుపాక, నదురుబాద, పసలపూడి, సోమేశ్వరం, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి.
- **మండపేట:** మెర్నిపాడు, చిన ద్వారపూడి, ఇప్పనపాడు, మారేడుబాక, వెలగతోడు, పాలతోడు, ద్వారపూడి.

నెమ్మది నెమ్మదిగా..

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వడంతో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ ప్రక్రియ ఆరంభమైంది. నెమ్మది నెమ్మదిగా సాగుతోంది. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన అమలాపురం మండలం పాలగుమ్మిలో ఇప్పటి వరకూ 85 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో భూములు, స్థలాలు, మార్ట్‌గేజ్‌లు, గిఫ్ట్‌లు, వీలునామాల రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. వీటితో పాటు పెళ్లిళ్లు, దత్తత, సొసైటీల రిజిస్ట్రేషన్లు కూడా చేయనున్నారు. రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లి (తాళ్లపాలెం)లో 53 వరకూ, ఆలమూరు మండలంలోని సచివాలయాల్లో 23 వరకూ రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీనిపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తే పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరుగుతాయని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.



రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లి సచివాలయం

సిబ్బందికి శిక్షణ

రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియపై సచివాలయాల్లో కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నారు. సబ్ డివిజన్ అయిన భూములకే రిజిస్ట్రేషన్ చేయాలని చెబుతున్నారు. సేల్, గిఫ్ట్, మార్ట్‌గేజ్ సెటిల్మెంట్ డీడ్‌లపై కొర్లేషన్ స్టేట్‌మెంట్, క్లాసిఫికేషన్ ఆఫ్ డాక్యుమెంట్స్ వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల వసూలు వంటి వాటిపై కూడా శిక్షణ ఇస్తున్నారు.

సాంకేతిక ఇబ్బందులు అధిగమించేందుకు..

సచివాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లకు సాంకేతికపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా సబ్ డివిజన్ జరిగిన భూమి విషయంలో రిజిస్ట్రేషన్‌కు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ఇటువంటి వాటి రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలుపు చేశారు. రీ సర్వే తరువాత అందుబాటులోకి వచ్చిన ల్యాండ్ ప్రాక్టికల్ మ్యాప్ (ఎల్‌పీఎం)లు సచివాలయాలకు వచ్చిన తరువాత సబ్ డివిజన్ జరిగిన భూములకు సైతం ఇక్కడ రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాం. జిల్లాలో ఎంపిక చేసిన 67 గ్రామాల్లో ఇప్పటికే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీని వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చాలా సులువవుతోంది. రిజిస్ట్రేషన్ల విషయాల్లో వారికి ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు సబ్ రిజిస్ట్రార్లు శిక్షణ ఇస్తున్నారు.

– హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్

శాకంబరీ నమోస్తుతే



శాకంబరీదేవిగా తలుపులమ్మ తల్లి

భక్తజన కల్పవల్లి తలుపులమ్మ అమ్మవారు.. ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారిని వేద పండితులు, అర్చకులు టన్ను కూరగాయలతో శాకంబరిగా అద్భుతంగా అలంకరించారు. కళ్లు చెదిరేలా కాంతులీనిన అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

– తుని రూరల్

రత్నగిరికి భక్తుల తాకిడి

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. సత్యదేవుని దర్శనానికి తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తులు వస్తూనే ఉన్నారు. దర్శనం లైన్లు, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంత మంటపాలు భక్తులతో నిండిపోయాయి. ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. వ్రతాలు 3 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో సుమారు 5 వేల మందికి భోజనం పెట్టారు. నాలుగు రోజులుగా వాతావరణం చల్లగా ఉంది. అయితే, ఆదివారం సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపించడంతో భక్తులు అల్లాడిపోయారు. ఆలయ ప్రాంగణం, తూర్పు, పశ్చిమ రాజగోపురం మెట్లు ఎండకు వేడెక్కిపోతూండటంతో నడవలేక చాలా ఇబ్బంది పడ్డారు. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు రెండు రాజగోపురం మెట్ల చివరి వరకూ కార్పెట్ వేసేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

లోవలో భక్తుల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానం కిక్కిరిసిపోయింది. ఆషాఢ మాసం మూడో ఆదివారం కావడంతో వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు లోవకు తరలివచ్చారు. క్యూ ద్వారా అమ్మవారిని 60 వేల మంది భక్తులు దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.4,59,765, పూజా టికెట్లకు రూ.5,41,590, కేశఖండన శాలకు రూ.42,120, వాహన పూజలకు రూ.8,630, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.1,12,996, విరాళాలుగా రూ.3,29,254 కలిపి మొత్తం రూ.15,15,665 ఆదాయం సమకూరిందని వివరించారు.

ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొందాం

- జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు కృషిచేద్దాం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు విశ్వరూప్, వేణు,

అమలాపురం రూరల్: వచ్చే ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొని, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. అమలాపురంలోని గ్రాండ్ పార్కులో ఆదివారం రాత్రి జరిగిన పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు పాల్గొని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు

మిథున్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సమాయాత్తం చేసేందుకు త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లో పార్టీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల హామీలను 90 శాతానికి పైగా అమలు చేశామన్న ధైర్యంతోనే ప్రజల ముందుకు గడపగడపకూ వెళుతున్నామన్నారు. మిగిలిన పార్టీలకు అలా చెప్పుకునే ధైర్యం లేక, అడ్డదారుల్లో అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రులు విశ్వరూప్, వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ గెలిచే బలం లేకనే జనసేన తదితర పార్టీలతో పొత్తుల కోసం టీడీపీ నాయకులు ఎగబడుతున్నారని విమర్శించారు.

అమలాపురం అల్లర్ల కేసులు ఎత్తివేస్తాం

అమలాపురం టౌన్: కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టినప్పుడు జరిగిన అమలాపురం అల్లర్లకు సంబంధించిన కేసులను ఎత్తివేస్తామని, వీటి విషయంలో ఎవ్వరూ అధైర్యపడవద్దని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. అమలాపురంలోని గ్రాండ్ పార్కులో ఆదివారం సాయంత్రం విలేకర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. పలు ప్రశ్నలకు మిథున్‌రెడ్డి, మంత్రులు సమాధానాలు చెప్పారు.

భూసేకరణ మాదే

కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ వ్యయంతో 25 నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్న ఒప్పందం గతంలోనిదని మిథున్‌రెడ్డి సమక్షంలో మంత్రి విశ్వరూప్ వివరణ ఇచ్చారు. ఆ ఒప్పందంలో మార్పులు జరిగాయని చెప్పారు. ఇప్పుడు ప్రాజెక్ట్ వ్యయంలో 25 శాతం నిధులు భరించకుండా దానిస్థానే రైల్వే ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ఖర్చు అంతా రాష్ట్ర ప్రభు త్వమే భరించేలా కొత్త ఒప్పందం కుదిరిందన్నారు.

కోనసీమ ముందంజ

జిల్లాలో ఎమ్మెల్యేలు, మంత్రులు గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ విధానాలను తెలియజెప్పడంతో ముందున్నారన్నారు. మీకు మేలు జరిగిందని అనిపిస్తేనే మాకు ఓటు వేయండి అని ప్రజలను అడుగుతున్న ముఖ్యమంత్రి దేశంలోనే జగన్ ఒక్కరేనన్నారు. అన్ని హామీలూ నెరవేర్చామన్న నమ్మకంతో ఓటర్లు తమవైపే విశ్వాసంగా ఉన్నారని తెలిపారు. కోనసీమ జిల్లాలో పాత ఎమ్మెల్యేలకే టిక్కెట్లు ఇస్తాం, మళ్లీ కోనసీమలో వైఎస్సార్ సీపీదే హవా అని స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి బాబీ, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, అమలాపురం పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, గెద్దం సంపదరావు, గన్నవరపు శ్రీనివాసరావు,ఎంపీపీ ఇళ్ల శేషారావు జిల్లా డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ పరిశీలకులు ఎ.రాజబాబు, రామాంజనేయులు పాల్గొన్నారు.

చేనేత చిద్విలాసం

- నేతన్నకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- వైఎస్సార్ నేతన్న నేస్తంతో ఆర్థిక భరోసా
- ఏటా రూ.24 వేల జమ
- ఐదో విడత పంపిణీకి చర్యలు
- జిల్లాలో 4,256 మంది లబ్ధిదారులు

రాయవరం: మగ్గంపైనే ఆధారపడి జీవనం సాగించే చేనేత కుటుంబాలు వార్పు, నూలు, ఇతర సామగ్రి కొనుగోలు నిమిత్తం ఒకప్పుడు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వచ్చేది. చీర పూర్తి కాగానే వచ్చిన దాంట్లో వడ్డీలు కట్టుకుని మిగిలిన సొమ్ముతో పిల్లల చదువులు, కుటుంబ పోషణ చూసుకునే పరిస్థితి ఉండేది. నేతన్నల కష్టాలను పాదయాత్రంలో స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగు నెలలకే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హులైన లబ్ధిదారులకు ఏటా రూ.24 వేలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో నేతన్నలకు ప్రభుత్వం నుంచి భరోసా లభించింది.

ఆర్థిక తోడ్పాటు

వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చేనేతకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేలా ఉంటున్నాయి. ముద్ర రుణాలు, జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా 90 శాతం సబ్సిడీతో పనిముట్లు, జాతీయ చేనేత బ్రాండ్ పథకం ద్వారా నేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం తదితర కార్యక్రమాలతో నేతన్నల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చారు. ఫలితంగా చేనేత కుటుంబాల్లో మగ్గాల చప్పుళ్లు మళ్లీ వినిపిస్తున్నాయి.

టీడీపీ హయాంలో నిర్వీర్యం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేనేత రంగం నిర్వీర్యమైందనే విమర్శలున్నాయి. నాటి పాలకులు చేనేత రంగాన్ని చిన్నచూపు చూడడంతో వృత్తినే నమ్ముకున్న చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చేనేత కార్మికులను ఆదుకునే ఉద్దేశంతో సీఎం జగన్ అధికారంలోకి రాగానే 2019 డిసెంబరు 21న అనంతపురం జిల్లా ధర్మవరంలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకాన్ని ప్రారంభించి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా రూ.24 వేలు అందిస్తున్నారు.

ఐదో విడతకు ఏర్పాట్లు

నేతన్న నేస్తం పథకంలో మగ్గం ఉన్న వారికే లబ్ధిని చేకూరుస్తారు. ఒక కుటుంబంలో రకరకాల పనులు చేసే వారందరినీ చేనేత కార్మికులుగా పరిగణిస్తారు. అలాగే ఒక కుటుంబంలో రెండు మూడు మగ్గాలున్నప్పటికీ కుటుంబంలో ఒకరికే నేతన్న నేస్తం పథకాన్ని అందిస్తారు. రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఇప్పటికే నాలుగు విడతల సాయం నేరుగా నేతన్నల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం



మగ్గంపై నేత నేస్తున్న చేనేత కార్మికురాలు

ఐదోవిడత అమలుకు చర్యలు చేపట్టింది. ఈనెలలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేయనున్నారు. ఇందుకోసం అధికారులు అర్హుల జాబితా సిద్ధం చేశారు. ఈ పథకం కింద ఐదో విడతలో జిల్లా వ్యాప్తంగా 4,256 మంది లబ్ధిదారులు నమోదయ్యారు. ఈ జాబితా ప్రకారం లబ్ధిదారుల వివరాలు ఆయా సచివాలయాలకు చేరుతాయి. అభ్యంతరాల అనంతరం అర్హులైన వారికి నేతన్న నేస్తం ఆర్థిక సాయాన్ని అందజేస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 23 చేనేత సహకార సంఘాలున్నాయి. 22 మండలాల్లో దాదాపుగా 7,500 చేనేత కార్మికులున్నారు. అమలాపురం, అంబాజీపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, మండపేట, కె.గంగవరం, రాయవరం, సఖినేటిపల్లి, మలికిపురం, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాల్లో అధిక సంఖ్యలో చేనేత కార్మికులున్నారు. ప్రభుత్వం నుంచి జాబితాలు సచివాలయాలకు చేరుతాయని, వాటిపై అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఫైనల్ జాబితాను ప్రకటించనున్నట్లు చేనేత జౌళిశాఖ ఏడీ కె.పెద్దిరాజు తెలిపారు.

జిల్లాలో నేతన్న నేస్తం పథకం వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	మంజూరైన సొమ్ము
2019-20	3,778	రూ. 9,06,72,000
2020-21	3,589	రూ. 8,61,36,000
2021-22	3,776	రూ. 9,06,24,000
2022-23	4,242	రూ. 10,18,08,000
2023-24	4,256	

ఎఫ్‌డీఆర్ సాంకేతికతతో రోడ్ల నిర్మాణం



రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ చీఫ్ ఇంజినీర్ అమరనాథ్‌రెడ్డి తదితరులు

అమలాపురం రూరల్: రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ఎఫ్‌డీఆర్ సాంకేతికతతో రోడ్లు నిర్మించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని, దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని రోడ్లను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు పీఆర్ చీఫ్ ఇంజినీర్ అమరనాథ్ రెడ్డి తెలిపారు. కేటగిరి 2లో భాగంగా అమలాపురం రూరల్ మండలం గున్నేపల్లి అగ్రహారం మామిడితోట రోడ్డును పీఆర్ ప్రాజెక్ట్ డిప్యూటీ ఈఈ అన్యం రాంబాబు, పంచాయతీరాజ్ డీఈఈ పీఎస్ రాజకుమార్‌తో కలిసి ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలును రూ.12 కోట్లతో నిర్మిస్తామని, త్వరలో టెండర్లు ఖరారు చేస్తామన్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి విశ్వరూప్ సూచనలతో అవసాన దశలో ఉన్న కమ్యూనిటీ హాళ్లను తనిఖీ చేస్తున్నామని ఈఈ అన్యం రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈలు రాధాకృష్ణ, కొండలరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్


విజేతలకు పతకాలు అందజేస్తున్న డ్రగ్స్ ఏడీ నాగమణి, ఇమ్మానుయేల్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక పేపర్‌మిల్లు క్లబ్ హౌస్‌లో ఆదివారం ఎస్‌ఎం కుంగ్‌ఫూ ఫస్ట్ నేషనల్ లెవెల్ కుంగ్‌ఫూ అండ్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ 2023 ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు పలు రాష్ట్రాల నుంచి కరాటే, కుంగ్‌ఫూ క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 800 మంది వరకూ పోటీలో పాల్గొన్నారు. పోటీలకు స్పాన్సర్లుగా జిల్లా ఔషధ నియంత్రణాధికారి డి.నాగమణి, డి.ఇమ్మానుయేలు వ్యవహరించారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఉచిత భోజనం, పలు సౌకర్యాలు కల్పించారు. వైట్, ఎల్లో, ఆరంజ్, గ్రీన్, బ్రౌన్, బ్లాక్ బెల్ట్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. వీటిల్లో ఆంధ్రప్రదేశ్ చాంపియన్‌షిప్ సాధించింది. విజేతలకు ఏడీ నాగమణి దంపతులు పతకాలు బహూకరించారు.

11 కాసుల బంగారు ఆభరణాల చోరీ

పెరవలి: బంధువుల ఊరు వెళ్లివచ్చేసరికీ ఇంట్లోని 11 కాసుల బంగారు ఆభరణాలను దొంగలు చోరీ చేశారు. ఎస్సై ఎం.సూర్యభగవాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెరవలి గ్రామానికి చెందిన ఆకుల ముత్యంబాబు టీవీ మెకానిక్. పిల్లల స్కూల్‌కు సెలవు కావడంతో శనివారం ఉదయం బంధువుల ఇంటికి అమలాపురం వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చారు. అయితే ఇంటి తలుపు తెరచి ఉండడంతో లోపలకు వెళ్లి పరిశీలించగా, బీరువాలోని 11 కాసుల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

మండపేట: పట్టణంలోని టిడ్కో ఫ్లాట్ల వద్ద నివసిస్తున్న ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎ.బుచ్చిబాబు (51) భార్య గతంలో చనిపోయింది. అప్పటి నుంచి అతడు మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఎక్కువగా ఉండటంతో జీవితంపై విరక్తి చెంది ఫ్లాట్‌లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళకాలం నిలిచేలా..

- హస్తకళలకు నూతన ఉత్తేజం
- లేపాక్షి ద్వారా పూర్వవైభవం
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు


రాజమహేంద్రవరంలోని లేపాక్షి ఎంపోరియం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): హస్తకళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవం పోస్తున్నాయి. వాటిపై ఆధారపడిన కళాకారులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. గతంలో హస్తకళాకారులకు చేతినిండా పని ఉండేది. వారు తయారుచేసిన వస్తువులకు ఎంతో డిమాండ్ ఏర్పడేది. రానురాను వాటి స్థానాన్ని చైనా మార్కెట్ ఆక్రమించింది. చైనా వస్తువులు తక్కువ ధరకు దొరకడంతో జనం మెల్లగా వాటికి అలవాటు పడిపోయారు. మన కళాకారులు చేతితో చేసిన వాటికి సమయం ఎక్కువ పట్టడం, శ్రమ కూడా అధికంగా ఉండటంతో వాటి ధర కుంచెం ఎక్కువగా ఉండేవి. కానీ చైనా నుంచి వచ్చేవి మెషీన్‌తో తయారు చేసిన కావడం, కొత్త మోడళ్లలో లభించడంతో జనాలు వాటికి ఆకర్షితులయ్యారు. దీనితో హస్తకళాకారులు ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వాల ప్రోత్సాహం

దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన కళాకారులను ప్రోత్సహిస్తున్నాయి. రాష్ట్ర ఇండస్ట్రీ, కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత, ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ బి.విజయలక్ష్మి, ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. బాలసుబ్రమణ్యం రెడ్డి, ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వ అనేక చర్యలు చేపడుతున్నారు. అంతర్జాతీయ సమ్మిట్‌లు నిర్వహించినప్పుడు లేపాక్షి ద్వారా వివిధ రకాల హస్తకళలను ప్రదర్శించి అంతర్జాతీయ మార్కెట్‌ను పెంచుతున్నారు. విశాఖపట్టణంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సమ్మిట్, జీ 20 సదస్సు తదితర వాటిలో లేపాక్షిని ప్రమోట్ చేశారు. అలాగే వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్ పేరుతో ఆయా జిల్లాలో ప్రసిద్ధి చెందిన వస్తువులను అంతర్జాతీయ మార్కెట్‌కు చేరువ చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా తిరుపతిలో తయారు చేసిన వుడ్ కార్వింగ్‌లను ప్రధానమంత్రి మోదీ, ఇతర నాయకులకు బహుమతులు అందజేస్తున్నారు. తద్వారా వాటికి ప్రాచుర్యం కల్పిస్తున్నారు.


వైట్‌వుడ్ బర్డ్స్


రత్నం పెన్నులు


వైట్‌వుడ్ బర్డ్స్ తయారు చేస్తున్న నాగరాజు తదితరులు

50 ఏళ్లుగా..

మా నాన్న ఎం.చిన్న సత్యం వైట్ వుడ్ బర్డ్స్ తయారు చేసేవారు. ఆయన నుంచి నేను ఈ కళను నేర్చుకున్నాను. తూర్పుగోదావరి జిల్లాకి నా కళను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. గత 50 ఏళ్లుగా ఈ వృత్తిలోనే కొనసాగిస్తున్నాను. ఏపీ, తెలంగాణలో అన్ని లేపాక్షి షోరూమ్‌లో నా వైట్‌వుడ్ బర్డ్స్‌ని తీసుకుంటున్నారు.

– ఎం.నాగరాజు, వైట్ వుడ్ బర్డ్స్ తయారీ దారుడు

1982లో ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మన రాష్ట్రంలో 14 లేపాక్షి షోరూమ్‌లు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ వద్ద 1982లో లేపాక్షి ఎంపోరియం నెలకొల్పారు. ఇక్కడకు జిల్లా వాసులతో పాటు ఎన్‌ఆర్‌ఐలు తరచూ వస్తారు. హస్తకళావస్తువులను కొనుగోలు చేసి, తమ స్నేహితులకు, బంధువులకు బహుమతిగా అందజేస్తారు. వన్ ప్రొడక్ట్, వన్ డిస్ట్రిక్ట్‌లో భాగంగా తూర్పుగోదావరిలో వైట్ వుడ్ బర్డ్స్, రత్నం పెన్నులు, కాకినాడ జిల్లాలో కలంకారి బ్లాక్ ప్రింటింగ్ ఎంతో ప్రాచుర్యం పొందాయి. రాజమహేంద్రవరం పేరు తలచుకోగానే రత్నం పెన్నులు గుర్తుకు వస్తాయి. 1930లో మొదలు పెట్టిన ప్రస్థానం నేటికి నిరంతరంగా కొనసాగుతోంది. మహాత్మా గాంధీజీ సైతం ఈ పెన్నులను ప్రశంసించారు. మెషీన్లు అందుబాటులోకి వచ్చినా నేటికీ చేతితోనే ఈ పెన్నులను తయారు చేస్తారు.

బుల్లెట్ మాయం


చోరీకి గురైన బుల్లెట్

సామర్లకోట: ఇంటి ముందు పార్కు చేసిన బుల్లెట్ చోరీకి గురైంది. స్థానిక మఠంసెంటర్‌లోని గంపల వారి వీధిలో నివాసం ఉంటున్న జి.సాయికృష్ణ పెద్దాపురంలో తన బావ బుల్లెట్ (ఏపీ05 ఈడీ 3534) తీసుకువచ్చి శనివారం రాత్రి ఇంటి ముందు పార్కు చేశాడు. ఊరు వెళ్లడం కోసం ఆదివారం ఉదయం చూడగా కనిపించలేదు. వెంటనే ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా, ఆదివారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ముసుగు వేసుకున్న ఇద్దరు దొంగలు బుల్లెట్‌ను చోరీ చేసినట్టు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితంలేని యువకుడి మృతి

ప్రత్తిపాడు రూరల్: కిత్తమూరిపేట సమీపంలోని పామాయిల్ తోటలో ఉన్న నీటి కొలనులో ఆదివారం యువకుడి మృతదేహం లభించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దిపాలెంలో శుక్రవారం మతిస్థిమితంలేని సుమారు 22 ఏళ్ల యువకుడు ఒంటిపై చొక్కా మాత్రమే ధరించి కిత్తమూరిపేట వైపు వెళ్లసాగాడు. స్థానికులు అతడికి దుస్తులు ఇస్తున్నా పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం కిత్తమూరిపేట సమీపంలోని కృష్ణంరాజు పామాయిల్ తోటలో దుర్వాసన రావడంతో, నిర్వాహకుడు చింతాకుల అమృతరావు పరిసరాలను పరిశీలించగా నీటి కొలనులో మృతదేహం కనిపించింది. అది మతిస్థిమితంలేని యువకుడిగా గుర్తించారు. అమృతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఏఎస్సై డి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిస్తే ప్రత్తిపాడు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కోడిపందేలపై దాడి

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లి శివారు శివాయలంకలో జరుగుతున్న కోడిపందేలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,540, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు.

ముగిసిన మానసిక వైద్య నిపుణుల రాష్ట్ర సదస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బుద్ధి, మనసు, చిత్త ప్రవృత్తులు, వాటి సమస్యల ప్రస్తావన సనాతన ధర్మం, వేదాంతం, ఉపనిషత్తులలో ప్రస్ఫుటంగా ఉందని మహోపాధ్యాయ ప్రాచార్య శలాక రఘునాథ శర్మ, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి అన్నారు. మానస హాస్పిటల్ నిర్వహణలో స్థానిక మంజీర ఇంటర్ నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మానసిక వైద్య నిపుణుల రాష్ట్ర సదస్సు రెండోరోజు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా సనాతన జ్ఞానాన్ని, ఆధునిక విజ్ఞానాన్ని సమన్వయం చేస్తూ ముఖాముఖీ చర్చ నిర్వహించారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కర్రి రామారెడ్డి సమన్వయ కర్తగా వ్యవహరించారు. మానసిక వైద్యులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ రఘునాథ శర్మ, విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి పలు అంశాలను వివరించారు. ఉపనిషత్తులలో, భారతీయతత్వ శాస్త్రంలో జ్ఞానానికి, విజ్ఞానానికి చక్కని విభజన రేఖలు ఉన్నాయన్నారు. మానసిక దౌర్బల్యం ఏర్పడినపుడు పరిష్కార మార్గం సనాతన ధర్మంలో చూపించారన్నారు. కురుక్షేత్ర యుద్ధ సమయంలో అర్జునుడు ఢీలా పడినపుడు భగవద్గీత ద్వారా కృష్ణుడు కౌన్సెలింగ్ ఇచ్చాడని, అలాగే రావణాసురునితో యుద్ధానికి సంశయించినపుడు రాముడికి ఆదిత్య హృదయం ద్వారా అగస్త్యుడు జ్ఞానబోధ చేశాడన్నారు. తత్వ వివేచన, తత్వ విచారణ ఎంతో ముఖ్యమని, అదే ఇప్పుడు మానసిక వైద్యంగా మారిందని వివరించారు. ఎంత ఆధునికత వచ్చినా సరే, సనాతన ధర్మంలోని అంశాలను కొట్టి పారేయలేమని డాక్టర్ రామారెడ్డి అన్నారు.

అబద్ధాలు మాట్లాడితే 'వారాహి' అమ్మవారు క్షమించరు

పవన్ కల్యాణ్‌కు మంత్రి కొట్టు సత్యనారాయణ హితవు



అన్నవరం: 'వారాహి' అని అమ్మవారి పేరు పెట్టుకున్న వాహనంపై నిలబడి అబద్ధాలు మాట్లాడితే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆ వారాహి అమ్మవారు క్షమించరని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం విశాఖపట్నం వెళ్తున్న ఆయన మార్గం మధ్యలో కాకినాడ జిల్లా అన్నవరంలో ఆగారు. ఇక్కడ విశాఖపట్నం – విజయవాడ జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయ పనులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. అటువంటి నేతను విమర్శించడం పవన్ కల్యాణ్‌కు తగదని అన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు నాయుడు ఎన్ని దుర్మార్గాలు చేశారో ప్రజలందరికీ తెలుసని, ఆయన గురించి పవన్ కల్యాణ్ పల్లెత్తు మాట అనరని, పైగా చంద్రబాబు పరిపాలనే బాగుందన్నట్లు మాట్లాడతారని మండిపడ్డారు. రైతులకు ద్రోహం చేసిన వ్యక్తి చంద్రబాబు అయితే.. వారిని అన్ని విధాలా ఆదుకుని సకాలంలో అన్నీ అందిస్తున్నది ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. పవన్ కల్యాణ్ 175 స్థానాల్లో సొంతంగా పోటీ చేస్తే కాపు సామాజికవర్గ వ్యక్తిగా సంతోషించేవాడినని మంత్రి సత్యనారాయణ అన్నారు. కానీ, జనసేనను ఇంకో పార్టీకి అద్దెకిచ్చి, వాళ్లిచ్చే పదో పరకో సీట్లలో పోటీ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ వాస్తవాలు గ్రహించాలని మంత్రి హితవు పలికారు.

మనస్సున వున్నది పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: సమాజంలోని పరిస్థితులకు అద్దం పడుతూ రచనలు చేస్తున్న శ్రీపాద శ్రీనివాస్ మరిన్ని పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. ఆయన కథ, కథానికల సమాహారం మనస్సున వున్నది పుస్తకావిష్కరణ ఆదివారం స్థానిక ప్రకాశం నగర్ ధర్మంచర హాలుపైన ఉన్న బుక్‌బ్యాంకు హాలులో ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ మిత్రులు, శ్రేయోభిలాషుల నడుమ ఆత్మీయ పూరిత వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమానికి నాగరాజు స్వాగతం పలకగా, సీనియర్ పాత్రికేయుడు వీఎస్ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. ఈ పుస్తకాన్ని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, శ్రీనివాస్ గురువులు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో జరిగిన పరిణామాలపై ఓ పుస్తకం తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని సూచించారు. రాయడం అనే వ్యసనాన్ని వదులుకోవద్దని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ పదేళ్ల ఎమ్మెల్యేగా చేసినప్పుడు అసెంబ్లీలో ప్రస్తావించదలచిన అంశాలను అందించి తన ఉన్నతికి శ్రీపాద శ్రీనివాస్ దోహదం చేశారని కొనియాడారు. ఇటీవల ఆ అంశాలను క్రోడీకరించి చట్టసభల్లో గోదావరి గళం పేరిట పుస్తకాన్ని తీసుకువచ్చిన విషయం ప్రస్తావించారు. సీనియర్ న్యాయవాది చింతపెంట ప్రభాకర్ పుస్తకం సమీక్ష చేస్తూ ప్రజాస్వామ్యమా నీజాడ ఎక్కడ, కామన్ మ్యాన్, అమ్మ వడి, అంతరాత్మ పరమాత్మా, పండుటాకు, ఆత్మ వేదన, వందేభారత్ ట్రైన్‌లో తొలి ప్రయాణం ఇలా శ్రీపాద శ్రీనివాస్ ఏ రచన తీసుకున్నా అందులో సందేశం, ప్రశ్న, గోదావరి వ్యంగ్యం మేళవించి చదివించేవిగా ఉన్నాయన్నారు. అనంతరం శ్రీపాద శ్రీనివాస్‌ను మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తరఫున మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అశోక్ కుమార్ జైన్, సక్కా శ్రీనగేష్, ప్రతిభ మూర్తి, మహాలక్ష్మీరావు మాస్టారు, మణి టీచర్, మాలిక్ మాస్టార్, బుడ్డిగ రవి, ఏ.నాగరాజు అల్లు బాబీ, షేక్ అసదుల్లా అహ్మద్, ప్రసాదుల హరినాథ్, వసుపులేటి కృష్ణ, ముళ్లా మాధవ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ


ఘటనా స్థలంలో కాలిపోయిన బైక్, ధ్వంసమైన ఫర్నిచర్

నల్లజర్ల: ఘంటావారిగూడెంలో కిళ్లీషాపు వద్ద ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగుతున్న యువకుల మధ్య తలెత్తిన వాగ్వాదం చివరకు ఘర్షణకు దారి తీసింది. బీరు బాటిళ్లు, కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వారిని తాడేపల్లిగూడెం, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. నల్లజర్ల సీఐ నున్న రాజు అందించిన వివరాల ప్రకారం.. గ్రామంలో రహదారి పక్కనే ఆదివారం సాయంత్రం తానం ప్రసాద్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ప్రారంభించే హడావుడిలో ఉన్నాడు. పక్కనే మేకా రాంబాబుకు చెందిన కిళ్లీకొట్టు వెనుక దూబచర్ల గాంధీ కాలనీకి చెందిన బోడిగడ్ల రాజ్‌కుమార్, కూరపాటి శ్రీను, మరో ముగ్గురితో కలిసి మద్యం తాగుతున్నారు. అంతకు ముందు అక్కడే మద్యం తాగిన మరో ఇద్దరితో రాజ్‌కుమార్ వర్గీయులకు వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి కుర్చీలతో కొట్టుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కుర్చీలు తీసుకెళ్లి దాడి చేసుకున్నారు. దీనిపై ప్రసాద్ ప్రశ్నించడంతో బడ్డీకొట్టు దగ్గర వివాదం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు మారింది. షాపు ప్రారంభానికి వచ్చిన ప్రసాద్ బంధువులు రాజ్‌కుమార్ వర్గీయులతో కలబడ్డారు. కర్రలు, బీరు బాటిళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఫర్నిచర్ కూడా ధ్వంసమైంది. ప్రసాద్ పల్సర్ బైక్‌పై పెట్రోలు పోసి నిప్పంటించారు. ఈ ఘర్షణలో రాజ్‌కుమార్, కూరపాటి శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. ప్రసాద్ భార్య వెంకటేశ్వమ్మ, తల్లిదండ్రులు ఏసుపాదం, తులసి, అయ్యవరానికి చెందిన అతడి సోదరి అల్లే వరలక్ష్మి, ఆమె భర్త నాగేంద్ర, వరసకు సోదరుడైన మారుబోయిన సందీప్‌కు గాయాలయ్యాయి. వారికి తొలుత తాడేపల్లిగూడెం, తర్వాత ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అనుమానాస్పద మృతి

- అదృశ్యమైన ప్రియుడు
- ముమ్మరంగా పోలీసుల దర్యాప్తు


మల్లేశ్వరి (ఫైల్)


మృతురాలి కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్, పట్టణ సీఐ దుర్గా శేఖరరెడ్డి

అమలాపురం టౌన్: పట్టణంలోని వనచర్ల వారి వీధికి చెందిన శ్రీపతి మల్లేశ్వరి (24) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. నాలుగు రోజుల కిందట అదృశ్యమైన ఆమె ఆదివారం ఉదయం అమలాపురం కంపోస్టుయార్డు సమీపంలో పంట కాలువ అంచున శవమై ప్రత్యక్షమైంది. మృతదేహం బాగా కుళ్లిపోయింది. అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ డి.దుర్గా శేఖరరెడ్డి, పట్టణ ఎస్సై జి.హరీష్ కుమార్ వనచర్లవీధిలోని ఆమె ఇంటిని, మృతదేహం దొరికిన పంట కాలువను పరిశీలించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. వనచర్లవారివీధికి చెందిన గాది నాగబాబు (చిన్న), మల్లేశ్వరి మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. గతంలో వారిద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. నాగబాబు భార్యను, మల్లేశ్వరి భర్తను వదిలేసి, వనచర్లవీధిలోనే ఓ ఇంట్లో సహజీవనం చేస్తున్నారు. వారికి రెండున్నరేళ్ల కుమార్తె కూడా ఉంది. మల్లేశ్వరి మూడు నెలలుగా హైదరాబాద్‌లో ప్రైవేటు జాబ్ చేస్తోంది. ఈనెల 5న డ్వాక్రా డబ్బులు తీసుకునేందుకు హైదరాబాద్ నుంచి అమలాపురం వచ్చింది. ఆరో తేదీన అదృశ్యమైంది. ఆమె తండ్రి శ్రీపతి రాంబాబు, బంధువులు అప్పటి నుంచీ గాలిస్తున్నారు. నాగబాబు తమ కుమార్తెను బంధువుల ఇంటిలో ఉంచాడు. రెండు రోజులుగా అతడు అదృశ్యం కావడంతో అతడిపై మల్లేశ్వరి కుటుంబీకులకు అనుమానం పెరిగింది. దీంతో ఆమె తండ్రి రాంబాబు శనివారం రాత్రి స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మహిళ అదృశ్యం కేసు నమోదు చేశారు. అయితే ఉదయానికి మల్లేశ్వరి పంట కాలువలో శవమై కనిపించింది.

పోస్టుమార్టం నివేదికతోనే వాస్తవాలు

మల్లేశ్వరి మృతదేహం కుళ్లిపోయింది. అమలాపురం తహసీల్దార్ పరమట శ్రీపల్లవి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు ఆదివారం సాయంత్రం సంఘటనా స్థలంలోనే శవ పంచనామా చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే ఆమె హత్యకు గురైందా, ఆత్మహత్య చేసుకుందా అనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. సోమ, మంగళవారాల్లో పోస్టుమార్టం నివేదిక వస్తుందన్నారు. మహిళ అదృశ్యం కేసును అనుమానాస్పద మృతిగా మార్పుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.